క్లుప్తంగా

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు



రేపల్లె రూరల్: పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని మున్సిపల్ వైస్‌చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త అన్నారు. పట్టణంలోని నేతాజీనగర్ సచివాలయంలో సోమవారం 22, 24 వార్డుల పరిధిలోని జగనన్న కాలనీ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను పంపిణీ చేసి మాట్లాడారు. అర్హత కలిగిన స్థలం లేని నిరుపేదలకు స్థలం అందించి సొంతింటి కల నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. పేదల సంక్షేమం కోసం పరితపిస్తున్న జగనన్నకు అండగా నిలవాలని కోరారు. 17వ వార్డు సచివాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్ ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు బేతపూడి కోటేశ్వరరావు, ఆయా వార్డు సచివాలయాల కన్వీనర్‌లు, గృహ సారథులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ద్విచక్రవాహనం దగ్ధం



రేపల్లె రూరల్: అగ్ని ప్రమాదానికి గురై ద్విచక్రవాహనం దగ్ధమైన సంఘటన పట్టణంలోని 14వ వార్డులో సోమవారం చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారి వై.సాంబశివరావు వివరాల మేరకు 14వ వార్డుకు చెందిన టి.శివగణేష్ ఎప్పటి మాదిరి గానే తన ద్విచక్రవాహనాన్ని స్టార్ట్ చేసే క్రమంలో పెట్రోలు ట్యాంకర్ వద్ద నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన శివగణేష్ వాహనాన్ని వదలి పక్కకు వచ్చేశాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదన్నారు. వాహనం పూర్తిగా దగ్ధమైందని సుమారు రూ.40 వేల ఆస్తినష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

సేవా సారథులు వలంటీర్లు

వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికి చేరువ చేయడంలో వలంటీర్ల పాత్ర ఎంతో కీలకమని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలని సూచించారు. నిరంతరం ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని ప్రభుత్వం వలంటీర్లకు అందించిందన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి

ప్రత్తిపాడు: చెరువులు నింపుకునేందుకు తాగునీరు వదిలి రెండు రోజులయ్యిందని, మరో మూడు రోజులకన్నా నీరు వచ్చే పరిస్థితి లేదని, అదే జరిగితే తాగునీటి కోసం ఇబ్బంది పడాల్సి వస్తుందని ప్రత్తిపాడు ఉప సర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి తహసీల్దారు స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో గ్రామస్తులు తమ సమస్యను ఏకరువు పెట్టారు. ప్రభుత్వం చెరువులు నింపుకునేందుకు తాగు నీటిని విడుదల చేసినప్పటికీ, కేవలం ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రత్తిపాడుకు నీళ్ల వచ్చే పరిస్థితులు కనిపించడం లేదన్నారు. ఆయా శాఖల అధికారులకు చెబుదామంటే వాళ్లు కంటికి కనిపించే పరిస్థితి కూడా ఉండటం లేదని, కనీసం స్పందనలో అయినా ఉంటారేమో చెబుదామని వస్తే ఇక్కడా లేరని వాపోయారు. మరో రెండు రోజులు చూస్తామని నీళ్లు ఇవ్వకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. సానుకూలంగా స్పందించిన తహసీల్దారు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని, చెరువులకు నీరు వచ్చేలా తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

జగనన్న సంకల్పం.. సొంతింటి కల సాకారం

- జగనన్న కాలనీల్లో జోరుగా ఇళ్ల నిర్మాణాలు
- 3,009 గృహాలతో మెగాసిటీగా ఆవిర్భావం
- నియోజకవర్గంలో 12,443 మందికి 290 ఎకరాల నివేశన స్థలాల పంపిణీ
- ప్రత్యేక చొరవ చూపుతున్న ఎంపీ మోపిదేవి





జగనన్న కాలనీలో వేగవంతంగా సాగుతున్న గృహ నిర్మాణాలు



అందంగా రూపుదిద్దుకున్న నూతన గృహం

రేపల్లెరూరల్: జగనన్న సంకల్పంతో పేదల కల నెరవేరింది. నాటి ప్రభుత్వ పాలనలో పేదవాడి సొంతింటి కల కలగానే మిగిలిపోయింది. అటువంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి తోడు ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు కృషితో పట్టణంలో మరో మెగాసిటీ ఆవిర్భావం చెందింది.

రేపల్లె నియోజకవర్గంలో 290 ఎకరాలలో రూ.20.17 కోట్లు వెచ్చించి 12,443 మంది గూడు లేని నిరుపేద లబ్ధిదారులకు నివేశన స్థలాలు అందజేశారు. దీనిలో భాగంగా రేపల్లె పట్టణంలో 66 ఎకరాల సింగిల్ లే అవుట్‌లో 3,009 మంది లబ్ధిదారులకు, రేపల్లె మండలంలో 50 లే అవుట్‌లలో 43 ఎకరాల విస్తీర్ణంలో 1,826 మంది లబ్ధిదారులకు, నగరం మండలంలో 69 ఎకరాల విస్తీర్ణంలో 3,143 మందికి, నిజాంపట్నం మండలంలో 74 ఎకరాల విస్తీర్ణంలో 3,250 మందికి, చెరుకుపల్లి మండలంలో 38 ఎకరాలలో 1,215 మందికి నివేశన స్థలాలు అందించారు.

మెగాసిటీగా ఆవిర్భావం

పట్టణంలో 66 ఎకరాల్లో టౌన్ ప్లానింగ్ నిబంధనలను అనుసరించి విశాలమైన రహదారులను నిర్మించడంతో పాటు 3,009 ప్లాట్లతో నివేశనా స్థలాలు అందించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేశారు. ఇప్పటికే 1,248 గృహాల నిర్మాణాలు పూర్తి చేసి నివాస యోగ్యాలుగా మార్చివేశారు. వివిధ దశల్లో 628 గృహాల నిర్మాణాలు జరుగుతున్నాయి. 1133 కుటుంబాల వారు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ప్రత్యేక ప్రణాళికలు

నివేశనా స్థలం పొందిన ప్రతి కుటుంబం ఇంటి నిర్మాణం పూర్తి చేసుకునే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. పట్టణంలోని 14 సచివాలయాల పరిధిలో ఏడుగురు నోడల్ అధికారులను నియమించి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. వార్డుల్లోని కౌన్సిలర్లు, గృహ నిర్మాణ శాఖాధికారులు, సచివాలయ సిబ్బంది, మెప్మా అధికారులతో ఇళ్ల నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం లేని కుటుంబాలకు ఇళ్లు కట్టించి ఇచ్చేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వస్తుండటంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు మొగ్గుచూపుతున్నారు.

సొంతింటి కల నెరవేరింది



ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా వాగ్దానాలు చేయటం తప్ప అవి కార్యరూపం దాల్చిన దాఖలాలు లేవు. ఎన్ని కల సమయంలో జగనన్న ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయటంతో పాటు పేదల పక్షపాతిగా మా సొంతింటి కల నెరవేర్చాడు. జగనన్న రుణం తీర్చుకోలేము.

–కర్రా లోకేశ్వరరావు, 11వ వార్డు, రేపల్లె టౌన్

జగనన్నకు రుణపడి ఉంటాం



కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే మాకు సొంతింటి కల నెరవేరడం ఆనందంగా ఉంది. పేదల కష్టాలు తెలిసిన జగనన్న ముఖ్యమంత్రి కావటం మా పాలిట వరం. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు తోడుగా నిలిచి మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుంటాం.

–బర్మా రాధ, 8వ వార్డు, రేపల్లె టౌన్

పెద్ద కొడుకులా మారిన జగనన్న



ఇద్దరు పిల్లలతో వ్యవసాయ పనులు చేసుకుంటూ అద్దె ఇంటిలో ఉండి తీవ్ర ఇబ్బందులు పడ్డాము. పెద్ద కొడుకులా మా కుటుంబానికి అండగా నిలిచి ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు కట్టుకునే విధంగా చేసిన మా అన్న జగనన్నకు రుణపడి ఉంటాం.

–బత్తుల మేరీ, 8వ వార్డు, రేపల్లె టౌన్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేశాం



జగనన్న కాలనీల ఏర్పాటుపై రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు నిరంతరం పర్యవేక్షిస్తూ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. జగనన్న కాలనీలో నీటి వసతి కల్పించేందుకు 17 బోర్లు వేసి 133 ట్యాంకర్లను ఏర్పాటు చేయటం జరిగింది. విద్యుత్ స్తంభాలు, అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేశాం. టౌన్ ప్లానింగ్ నిబంధనలతో లే అవుట్ ఏర్పాటు చేసి పేదలకు నివేశనా స్థలాలు అందించటం జరిగింది. ఇంటి నిర్మాణాలకు మెప్మా ద్వారా రుణాలు ఇప్పించడంతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఇంటి నిర్మాణాలను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

– శేషాద్రి, మున్సిపల్ కమిషనర్, రేపల్లె

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం



కూచిపూడి గ్రామస్తులతో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

కూచిపూడి(వేమూరు): వేమూరు మండలంలోని వరహాపురం గ్రామానికి చెందిన ఎస్టీ సామాజిక వర్గం ప్రజలు కూచిపూడి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబును సోమవారం కలిశారు. గ్రామంలో ఎస్టీ కాలనీలో విద్యుత్ లైన్ లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యుత్ సమస్య పరిష్కారించాలన్నారు. స్మశాన వాటిక సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఎస్టీ కాలనీలో విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. స్మశాన వాటిక సమస్యను సైతం త్వరలో పరిష్కారం చేస్తామన్నారు. ఈ నెల 10న ప్రకాశం జిల్లాలో నిర్వహించే 'సిద్ధం' సభకు అధిక సంఖ్యలో కదలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు

వేమూరు: మహిళా దినోత్సవాన్ని ఈ నెల 8న నిర్వహించడం జరుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రత్నకుమారి తెలిపారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 8న మహిళా దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ మహిళ దినోత్సవంపై అవగాహన సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. బాలికా చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో పట్టణాలకు దీటుగా గ్రామాభివృద్ధి

- పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్‌లు చేసిన ఘనత ప్రభుత్వానిదే
- బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: జగనన్న పాలనలో మారుమూల పల్లెలు సైతం అన్ని రకాల వసతులతో పట్టణాలకు దీటుగా మారుతున్నాయని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల పట్టణ, మండల పరిధిలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను ఆయన సోమవారం పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇళ్ల స్థలాలు ఇచ్చి వాటి నిర్మాణానికి నిధులు ఇవ్వటంతో పాటు రిజిస్ట్రేషన్‌లు సైతం చేసి ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. బాపట్లలోని ప్యాడిషన్‌పేట లే అవుట్‌లోని స్థలం విలువ రూ.9 లక్షలు ఉండగా దానికి అయ్యే రిజిస్ట్రేషన్ ఖర్చు రూ.17వేలు ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుండటం అభినందనీయమని అన్నారు. బాపట్లలో 5,200 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వటం జరిగిందన్నారు. బాపట్ల తహసీల్దార్ శ్రావణ్, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, కాగిత సుధీర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, పార్టీ నాయకులు షేక్.సయ్యద్‌పీర్, కొక్కిలిగడ్డ చెంచయ్య, నర్రావుల వెంకట్రావు, జోగి రాజా, ఇనగలూరి మాల్యాద్రి, సోముల రాజశేఖర్‌రెడ్డి, సోహిత్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని సంకటివారి వీధి వెనుక హిందూ స్మశాన వాటిక వద్ద ఉన్న రక్షిత మంచినీటి సరఫరా పథకానికి సంబంధించిన మోటార్ దగ్ధమైనందున నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని సర్పంచ్ దారా రవి కిరణ్మయి సోమవారం తెలిపారు. మోటారుకు తక్షణమే మరమ్మతులు నిర్వహించి మంగళవారం సాయంత్రానికి తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

మందకృష్ణ మాదిగ సభను జయప్రదం చేద్దాం

వేమూరు: వికలాంగుల సమస్యలపై గుంటూరు నాగార్జున యూనవర్శిటీ వద్ద మంద కృష్ణ మాదిగ సమావేశం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి యల్లమాటి దాసు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. నియోజకవర్గంలోని వికలాంగులంతా సభకు కదలి రావాలని ఆయన పిలుపు నిచ్చారు. వికలంగుల సంక్షేమమే ధ్యేయంగా పని చేయడం జరుగుతుందని చెప్పారు. వేమూరు బస్టాండ్ సెంటరులో వికలంగులకు వినత పత్రం అందజేశారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన ముస్లింలతో ఎమ్మెల్యే రఘుపతి

కర్లపాలెం: సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. కర్లపాలెం పంచాయతీ పాత ఇస్లాంపేట గ్రామానికి చెందిన 17 మంది ముస్లింలతో పాటు పేరలి గ్రామానికి చెందిన మరో 15 మంది ముస్లిం సోదరులు సోమవారం ఎమ్మెల్యే కోన రఘుపతి సమక్షంలో ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే రఘుపతి వీరందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల మతాలకు రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని చెప్పారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరినట్లు ముస్లిం సోదరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అమీర్‌బేగ్, పేరలి సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు ఆసిఫ్ అలీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు పొన్నూరులో ఉచిత వైద్య శిబిరం

పొన్నూరు: బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇటుకంపాడు రోడ్డు బుర్రయ్య సత్రంలో మంగళవారం జగన్మామ సంక్షేమ సంగమం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈవో, వైఎస్ఆర్ సీపీ పొన్నూరు నియోజకవర్గం సమన్వయకర్త అంబటి మురళీ కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో గుండె పదిలం, నేత్ర జ్యోతి, దివ్యాంగ దర్శిని, ఫిజియోథెరపీ సంబంధిత వైద్య సేవలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు శిబిరాన్ని సందర్శించి, ఆరోగ్య పరీక్షలు చేయించుకొని వైద్య సేవలు పొందాలన్నారు.

రోటరీ క్లబ్ సేవలు ఎనలేనివి

వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి



ఆసుపత్రికి వీల్ చైర్లు అందజేస్తున్న వరికూటి అశోక్‌బాబు, బౌడ చైర్మన్ దేవినేని

భట్టిప్రోలు: రోటరీక్లబ్ సేవలు ఎనలేనివని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం రోటరీక్లబ్ రేపల్లె రూరల్ సంస్థ వారి ఆధ్వర్యంలో రూ.75 వేలు వ్యయం చేసే 11 వీల్ చైర్లను బౌడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావుతో కలసి అశోక్‌బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ సమాజ సేవలో రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. సమాజ సేవే పరమావధిగా పని చేస్తుందని అన్నారు. క్లబ్ ద్వారా పేదలకు చేస్తున్న సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ సందర్భంగా అశోక్‌బాబును రోటరీ క్లబ్ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ వీల్ చైర్లను భట్టిప్రోలు, వెల్లటూరు పీహెచ్‌సీలకు అందచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎంఎం సక్సేన, కోశాధికారి ఏపూరి సాయేశ్వరరావు, కేవీ నాగమల్లేశ్వరరావు, గొట్టుముక్కల బాపారావు, చినబుజ్జి, సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు మూడు అర్జీలు



ఏవోకు అర్జీ అందజేస్తున్న గ్రామస్తులు

రేపల్లె రూరల్: ప్రజలు తమ సమస్యలను స్పందన కార్యక్రమంలో అర్జీల రూపంలో అందజేసి పరిష్కరించుకోవచ్చని ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి సీహెచ్ పద్మావతి అన్నారు. స్థానిక రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. స్పందన కార్యక్రమానికి మూడు అర్జీలు అందాయన్నారు. పట్టణంలోని మురుగు నీటి సమస్యపై 19వ వార్డు నుంచి అర్జీ అందిందన్నారు. 5వ వార్డులో రైతు భరోసా మంజూరుతో పాటు రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ అర్జీ ఇచ్చారన్నారు. పిరాట్లంక, చెన్నుపల్లి వారిపాలెం, గంగడిపాలెం, రాజుకాల్వ, లంకెవానిదిబ్బ గ్రామాలకు తాగునీటి పరిష్కారం చూపాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజల నుంచి అర్జీ అందిందన్నారు. సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరిస్తామని వెల్లడించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు మేలు




ప్రదర్శనలను తిలకిస్తున్న గ్రామస్తులు

రేపల్లె రూరల్: వైజ్ఞానిక ప్రదర్శనలతో నేర్చుకున్న పాఠ్యాంశాలు విద్యార్థులు సుదీర్ఘకాలం పాటు గుర్తుంచుకుంటారని ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ బాపట్ల జిల్లా కోఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి అన్నారు. మండలంలో వడ్డీవారిపాలెంలోని శ్రీమతి సావిత్రి గణేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రయోగ పూర్వకంగా నేర్చుకుంటే పాఠ్యాంశాలను విద్యార్థులు అత్యంత సులభంగా గుర్తుంచుకుంటారని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగ పడతాయని చెప్పారు. మండలంలోని వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు 112 రకాల నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం బి.మాధవి, మండల సైన్స్ నోడల్ అధికారి లచ్చి కోటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు. స్థానికులు బండ్రెడ్డి శ్రీనివాసరావు, పలకా మణీశ్వరరావు, చెన్నుపాటి శ్రీనివాసరావు, తులం రమణలు కార్యక్రమానికి ఆర్థిక సాయం అందజేశారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

లింగంగుంటపాలెం(కాకుమాను): విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని లింగంగుంటపాలెం ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఆయన వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యలో రాణించే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఆదేశించారు. రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థుల హాజరు శాతం అధికంగా ఉండే విధంగా ఉపాధ్యాయులు తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు, పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రశాంతి, ఉమా మహేశ్వరరావు, నాంచారమ్మ, జ్యోతి కుమారి విద్యార్థులు ఉన్నారు.

6న చలపతి ఫార్మసీలో జాతీయ స్థాయి సదస్సు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ రామారావు

గుంటూరు రూరల్: భారతదేశ ఫార్మసీ పితామహుడు ప్రొఫెసర్ మహదేవలాల్ ష్రాఫ్ జయంతి పురస్కరించుకుని చలపతి ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు ఈ నెల 6న ఫార్మా అన్వేషణ్ 2024 జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. సోమవారం నగర శివారులోని లాం నందున్న కళాశాలలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఫార్మా అన్వేషణ్ కార్యక్రమంలో వివిధ పారిశ్రామిక వేత్తలు, ఫార్మా నిపుణులు పాల్గొంటున్నారన్నారు. చెన్నైకి చెందిన సీఎల్ బైద్‌మేత్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ గురుప్రసాద్ మొహతా మాట్లాడుతూ భారతదేశంలో ఫార్మా విద్య, వృత్తి స్థితిని పెంచటం, నియంత్రించటం, ఏకరూప విద్య, శిక్షణ, ఉపాధి యోగ్యత, ఆరోగ్య సవాళ్లు, అభివృద్ధి, పరిశోధన, విద్యార్థుల నైపుణ్యాలు, జాతీయ విద్యా విధానం ప్రకారం ప్రస్తుత పాఠ్యాంశాల పునర్ నిర్మాణం తదితర అంశాలకు ఇది మంచి వేదిక కానుందన్నారు.